క్లుప్తంగా

వైభవంగా తిరువాసగం ఊరేగింపు


ఆలయంలోకి పీఠాలను తీసుకు వస్తున్న చైర్మన్, అర్చకులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తిరువాసగం ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 10 గంటలకు చెన్నై అడయార్‌కి చెందిన 200 మంది శివ భక్తులతో ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి యోగ తిరువాచకం పీఠాన్ని శిరస్సుపై ఉంచుకుని ఊత్తుకోట్టై శ్రీసీలకంఠేశ్వరస్వామి ఆలయం నుంచి మేళతాళాలు, శివ నామస్మరణల నడుమ భక్తులతో కలిసి శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పాలక మండలి సభ్యుడు జి.మునివేలు పాల్గొన్నారు.

రామకృష్ణానంద లహరి పుస్తకావిష్కరణ



ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం రామకృష్ణాశ్రమంలో ఆదివారం రామకృష్ణానంద లహరి పుస్తక ఆవిష్కరణ జరిగింది. రామకృష్ణ పరమహంస బోధనలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 1000 పుస్తకాలను ఉచితంగా అందజేసినట్లు ఆశ్రమ అధ్యక్షుడు గోపీ మాస్టర్ తెలిపారు. కార్యక్రమంలో గంగవరం శ్రీదేవి, లీలావతి, నిర్మల, ఆనందరెడ్డి, రామకృష్ణ, సుబ్బరాయుడు, భక్తులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సోమశేఖర్



రేణిగుంట: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ మార్గాని సోమశేఖర్ ఎన్నికయ్యారు. ఢిల్లీలో జరిగిన జాతీయ మహాసభల్లో ఆయన ఎన్నిక జరిగింది. తిరుపతికి చెందిన ఆయన ఎంబీఏ, పీహెచ్‌డీ పూర్తి చేసి స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గతంలో విద్యార్థి పరిషత్ తిరుపతి నగర అధ్యక్షుడిగా, జిల్లా ప్రొఫెషనల్ స్టూడెంట్స్ కన్వీనర్‌గా, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. విద్యార్థుల సమస్యలపై, నూతన విద్యా విధానాల అమలుకై కృషి చేస్తానని ఆయన తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


తెలంగాణ హైకోర్టు జస్టిస్ ఎన్వీ బద్రీనాథ్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ బద్రీనాథ్, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, ఐఏఎస్ మాజీ అధికారులు నిమ్మగడ్డ రమేష్ కుమార్, ఎల్వీ సుబ్రహ్మణ్యం, తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కాణిపాకంలో కార్తీక అభిషేక పూజలు



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి కార్తీక మాసం సందర్భంగా ఆదివారం శాస్త్రోక్తంగా అభిషేకాలు చేశారు. ఉదయం స్వామివారి కల్యాణ వేదికలో సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, హోమం చేశారు. తదుపరి కల్యాణోత్సవం చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయదారులుగా టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన కాజ్ వే పనులు

- సీఎం, కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి అధికారుల బృందం
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడి




కోతకు గురైన తుంబూరు కాజ్‌వేను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ డీఈ ప్రభాకర్‌రెడ్డి, సుమన్‌కుమార్

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో మిచాంగ్ తుపాన్‌కు దెబ్బతిన్న రోడ్లు, కాజ్‌వేల పునర్నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. ఆదివారం పిచ్చాటూరు విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో తుపాన్ బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తుపాన్ నష్టంపై తాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమర్పించిన వినతులపై తక్షణం ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ప్రతి ఒక్క బాధితుణ్ణి ఆదుకోవాలని, దెబ్బతిన్న రోడ్లు, కాజ్‌వేల పునర్నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కలెక్టర్ వెంకటరమణరెడ్డికి సీఎం జగనన్న సూచించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఆ మేరకు కలెక్టర్ సైతం ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. అలాగే విద్యుత్ సమస్యలపై సీఎండీ నియోజకవర్గంలో పర్యటించి పరిస్థితిని స్వయంగా పరిశీలించారని, విద్యుత్ శాఖ ఎస్‌ఈ కూడా ఏడీ, ఏఈలతో ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తూ నేలకూలిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్ల స్థానంలో కొత్త వాటిని యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారని ఎమ్మెల్యే వివరించారు. నారాయణవనం మండలం పాలమంగళం కాజ్‌వే, పిచ్చాటూరు మండలం అడవికండ్రిగ రోడ్డు, కేవీబీ పురం మండలం, సీకే పూడి కాజ్ వే, నాగలాపురం మండలం ద్వారకానగర్ కాజ్ వే, సత్యవేడు మండలం వీఆర్ కండ్రిగ కాజ్ వేలతో పాటు వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల్లో కోతకు గురైన రోడ్లు, కాజ్ వే పనులను తక్షణం ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వీటితో పాటు ఇతర తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పడిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు.

కాజ్‌వేల పరిశీలన

తుపాన్ ప్రభావంతో నారాయణవనం అరుణానది ఉధృతికి దెబ్బతిన్న లోలెవల్ కాజ్‌వేలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరిస్తున్నట్లు జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ తెలిపారు. ఆదివారం పీఆర్ ప్రాజెక్ట్స్ డీఈ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన మండలంలో తుపాన్ దెబ్బకు కొట్టుకుపోయిన తుంబూరు, పాలంగళం నార్త్ కాజ్‌వేలను పరిశీలించారు. సుమన్‌కుమార్, సర్పంచ్ సాయిరవి చొరవ తీసుకుని పాలమంగళం నార్త్ కాజ్‌వేపై గ్రావెల్ తోలించి రాకపోకలకు సిద్ధం చేశారు. సుమన్‌కుమార్ రూ.10 వేలను సాయం అందివ్వగా, సాయిరవి సొంత ఖర్చులతో 30 ట్రాక్టర్ ట్రక్కుల గ్రావెల్ అందించి ఆదివారం సాయంత్రానికి మరమ్మతులు పూర్తి చేశారు. కొట్టుకుపోయిన తుంబూరు కాజ్‌వేపై ఇసుక బస్తాలతో రాకపోకలకు దారిని సిద్ధం చేయాలని సుమన్‌కుమార్ సూచించారు. అరుణానది ప్రవాహానికి వరుసగా కోతకు గురవుతున్న తుంబూరు కాజ్‌వేకు శాశ్వత మరమ్మత్తులు చేపట్టాలని డీఈకి సుమన్‌కుమార్ విన్నవించారు. ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి, పూర్తి స్థాయి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని డీఈ పేర్కొన్నారు.

భవహరణా.. శుభచరణా


కార్తీక దీపాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ఓం నమఃశ్శివాయ నామస్మరణతో శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రతిధ్వనించింది. శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజూ ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తున్నారు. ఆదివారం రాత్రి ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు ఓం నమఃశ్శివాయ అంటూ ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సంప్రదాయాన్ని కొనసాగించాలి


ఎమ్మెల్యేకు సమస్యను విన్నవిస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుసంధానంగా ఉన్న భరద్వాజతీర్థంలో మునీశ్వరస్వామి, గుర్రప్పస్వామి, చెంచు, లక్ష్మమ్మ ఇంటి దేవుళ్లకు పొంగళ్లు పెట్టుకుని పూజించుకునే సంప్రదాయాన్ని కొనసాగించాలని ఎమ్మెల్యేను భక్తులు కోరారు. ఆదివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి ఈమేరకు వారు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఆలయ అధికారులు కొన్ని షరతులతో పూజలు చేసుకోమనడం బాధాకరమన్నారు. మునుపటి సంప్రయదాయాన్ని కొనసాగించేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

స్వర్ణమ్మ మహా హారతుల పనులు పరిశీలన


జలహారతి పనులను పరిశీలిస్తున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించే స్వర్ణముఖి నది హారతి ఉత్సవ పనులను ఆదివారం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనలతో ఈనెల 12న స్వర్ణముఖి నది తీరాన మహా హారతి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 40–50 అడుగుల ఎత్తులో ఐదు నదీ హారతులు ఇచ్చేందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు కిషోర్‌కుమార్, ప్రతాప్, బాలజీ, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆయన వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు.

పెరిగిన భూగర్భ జలమట్టం


ఉధృతంగా ప్రవహిస్తున్న కాళంగినది


ఏడుగండ్లు వారధి వద్ద వరదనీటి ప్రవాహం

బుచ్చినాయుడుకండ్రిగ: తుపాన్ వర్షాలకు మండలంలోని కాళంగి నది ఉధృత ప్రవాహం కొనసాగుతూనే ఉంది. నదికి ఆనుకుని కాటూరు, పల్లమాల, చిన్నయిగుంట, అరిగిలకండ్రిగ, జంబుగోళం గ్రామాల రైతులకు చెందిన పొలాలున్నాయి. వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరిగిందని, సాగునీటికి ఢోకా లేదని రైతులు చెబుతున్నారు. అలాగే చెరువులకు కాలువల ద్వారా నీరు భారీగా చేరుతుంది. తలారివెట్టు, కల్లివెట్టు గ్రామాల మధ్య ఉన్న ఏడుగండ్లు వారధి కూడా ఉధృతంగా ప్రవహిస్తుంది. పంట పొలాల కోసం కాళంగినది ఒడ్డున ఏర్పాటు చేసిన బోరు మోటార్లు వరదనీటి ప్రవాహంతో దెబ్బతింటున్నాయి.

ఇంటింటికీ తాగునీటి కొళాయి

వరదయ్యపాళెం: కేంద్ర ప్రభుత్వం జలజీవన్‌మిషన్ పథకం కింది ఇంటింటికీ తాగునీటి సదుపాయం కల్పిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం మండలంలోని చిన్న పాండూరులో సర్పంచ్ శ్యామల, యానాదివెట్టులో సర్పంచ్ సామర్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను వివరించారు. బీజేపీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అయుష్మాన్ భారత్ ద్వారా ఏ రాష్ట్రంలోనైనా రూ.5లక్షల వరకు వైద్యం పొందొచ్చని తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ఇన్‌చార్జ్ సిద్ధలయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు పురుషోత్తమ్, సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సుదర్శన్ నాయుడు, చిన్న పాండూరు ఉపసర్పంచ్ మహేంద్ర, రైతు సలహా మండలి అధ్యక్షుడు మురళీ నాయుడు, సుబ్రమణ్యం, ఈఓపీఆర్డీ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తుపాన్‌తో దెబ్బతిన్న ఉద్యాన పంటలు


బీఎన్‌కండ్రిగలో నీట మునిగిన మిరప

బుచ్చినాయుడుకండ్రిగ: మిచాంగ్ తుపాన్ భారీ వర్షాలకు మండలంలో మామిడి, మిరప పంటలు పూర్తి దెబ్బతిన్నాయి. భీకర గాలులకు కనమనంబేడు, గాజులపెళ్లూరు, కంచన పుత్తూరు గ్రామాల్లోని వంద ఎకరాలకు పైగా మామిడి తోటల్లోని చెట్లు నేల కూలాయి బుచ్చినాయుడుకండ్రిగ, ఆర్ అనంతాపురం, పల్లమాల, పార్లపల్లి, కుక్కంబాకం, గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో 150 ఎకరాలకు పైగా మిరప పంట దెబ్బతినింది. 10 సంవత్సరాలకు పైగా వయస్సు ఉన్న మామిడి చెట్లు నేలకూలడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. కాపునకు వచ్చిన మిరప పంట దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

తుపాన్ బాధితులకు సరుకుల పంపిణీ


సత్యవేడు: సరుకుల అందజేత


రేణిగుంట: అన్నాసామిపల్లి ఎస్టీ కాలనీలో..


ఏర్పేడు: మేర్లపాక ఎస్టీకాలనీలో..

సత్యవేడు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఇళ్లు కొల్పోయి నిరాశ్రయులైన కుటుంబాలకు వీ టు హెల్ప్‌యూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. ఆదివారం మండలంలోని రాజుగుంట(ఏఎంపురం) రాజుల కండ్రిగ, కన్నావరం, రాచపాళెం మదనంబేడు, అంబాకం, కొత్తమారికుప్పం గ్రామాల్లోని బాధిత కుటుంబాలకు బియ్యం, పప్పు దినుసులు, వంటపాత్రలు, కూరగాయ ల అందజేశారు. సంస్థ ప్రతినిధులు శ్రావణకుమార్, భూమన బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రేణిగుంట మండలంలో..

రేణిగుంట: మండలంలోని వెంకటాపురం పంచాయతీ అన్నాసంపల్లె ఎస్టీ కాలనీ, మల్లిమడుగు ఎస్టీ కాలనీలో అమెజాన్, డొనేట్‌కార్డ్ సౌజన్యంతో ఆషా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తుపాన్ బాధితులకు నిత్యావసర సరుకులు, బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా ఇబ్బందులకు గురవుతున్న పేదలకు సాయం చేసే లక్ష్యంతో ఈ సామాజిక కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్‌రాజు తెలిపారు. వెంకటాపురం సర్పంచ్ సుశీలమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పేరూరు పురుషోత్తంరెడ్డి చేతుల మీదుగా సరుకులను పంపిణీ చేశారు.

మేర్లపాక ఎస్టీ కాలనీలో..

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్టీ కాలనీలో ఆదివారం సర్పంచ్ గంగాధరం గిరిజనులకు నిత్యావసర సరకులను అందజేశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు తుపానుతో ఇబ్బందులు పడుతున్న 20 కుటుంబాల వారికి నిత్యావసర సరకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎంపీటీసీ సభ్యుడు భరత్‌కుమార్, వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.


కండలేరులో 13.102 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 13.102 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి జలాశయానికి 150 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 10 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తుళ్లుతున్న సదాశివకోన రిజర్వాయర్

- 4 వేల ఎకరాలకు సాగునీరు
- పర్యాటకుల సందడి


నిండుకున్న సదాశివకోన రిజర్వాయర్


కలుజు వద్ద పర్యాటకుల సందడి

ఏర్పేడు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలోని పాయిల్‌సెంటర్ సమీపంలో ఉన్న సదాశివకోన రిజర్వాయర్ జళకలను సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకుల సందడి రోజురోజుకి పెరుగుతోంది. రిజర్వాయర్ ఒకసారి నిండితే 15 గ్రామాలకు చెందిన సుమారు 4 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. రిజర్వాయర్ 184.5 ఎంసీఎఫ్‌టీ, 0.8 టీఎంసీల నీటి సామర్థ్యం, 41 స్క్వేర్ మైల్స్, 70 మీటర్ల పొడవు, 30 అడుగుల ఎత్తుతో కలుజు నిర్మాణం కలిగి ఉంది. రిజర్వాయర్ నుంచి కుక్కలగుంట, పాయిల్‌సెంటర్, చెల్లూరు, వడ్లగుంట, ఎండీపుత్తూరు, జ్ఞానంపేట, మడిబాక, కందాడు, వెంకటాపురం, గుండ్లకండ్రిగ, గుడిమల్లం, రాజులకండ్రిగ, సదాశివపురం, కుక్కలవారికండ్రిగ తదితర గ్రామాల చెరువులకు సాగునీటిని అందిస్తుంది. చెరువుల ద్వారా 2,500 ఎకరాలకు అధికారికంగా, సుమారు 1500 ఎకరాలకు అనధికారికంగా వరి, వేరుశెనగ, మిరప, కూరగాయల తోటలకు సాగునీరు అందుతుంది. ఒకసారి రిజర్వాయర్ నిండితే రబీ సీజన్‌కు సాగునీటికి ఢోకా ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటకుల సందడి

సదాశివకోన రిజర్వాయర్ వద్ద జల సందడి నెలకొంది. పర్యాటకుల సందడి రోజురోజుకు పెరుగుతోంది. ఏర్పేడు, సత్యవేడు, శ్రీకాళహస్తి, రేణిగుంట మండలాలు, తిరుపతి, చెన్నై నుంచి కూడా పర్యాటకులు రిజర్వాయర్‌ను సందర్శిస్తున్నారు. కలుజు నుంచి ప్రవహించే నీటిలో స్నానాలు చేస్తూ యువకులు, మహిళలు కేరింతలు కొడుతున్నారు. పర్యాటకుల రక్షణ కోసం రిజర్వాయర్ సమీపంలో అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ చెక్ పోస్టును ఏర్పాటు చేసింది.

నేడు జల హారతి

సదాశివకోన రిజర్వాయర్ వద్ద సోమవారం సాయంత్రం గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయ ఆధ్వర్యంలో జలహారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.